క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



గురవయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట : వైఎస్సార్‌సీపీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ తండ్రి గురవయ్యను గురువారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. గురవయ్య అనారోగ్యంతో నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి, అక్కడికే వెళ్లి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆయన వెంట రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు వంగవీటి



వంగవీటి మోహనరంగ విగ్రహానికి నివాళుల ర్పిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : పేదల గుండె చప్పుడు వంగవీటి మోహనరంగ అని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద వంగవీటి మోహనరంగ 36వ వర్ధంతిని పురస్కరించుకుని బలిజ సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ.. వంగవీటి మోహనరంగా ఒక కులానికే చెందిన నాయకుడు కాదన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బలిజ నాయకులు ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, స్వర్ణమూర్తి, అంజూరు వెంకటేష్‌బాబు, కొట్టే సత్యనారాయణ, పురుషోత్తంబాబు, మందల చంద్రమౌళి, పూడి రవికుమార్, సిద్ధులగారి ప్రసాద్, కంతా ఉదయ్, సాధన మున్నా, ఉత్తరాది శరవణకుమార సురేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

నాగలాపురం : స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నాగలాపురం -1, 3, విలేజ్ హెల్త్ సెంటర్ పరిధిలో వైద్యాధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా చేస్తున్నారు. ఈ బస్సుల్లోనే మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాని గ్రామంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరాటేలో విద్యార్థిని ప్రతిభ



ప్రియదర్శినిని అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ ఐశ్వర్య

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ప్రీ ప్రైమరీ చదువుతున్న ప్రియదర్శిని కరాటే పోటీల్లో సత్తా చాటింది. చెన్నైలోని పెరంబదూరులో ఈనెల 22న మెమోరియల్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రియదర్శిని మూడో స్థానం కైవసం చేసుకుంది. దీంతో గురువారం పాఠశాలలో డైరెక్టర్ ఐశ్వర్య ప్రియదర్శినిని అభినందించారు.

టీటీడీ క్యాలెండర్లకు జనం బారులు


తిరుపతి సిటీ: టీటీడీ క్యాలెండర్ల కోసం భక్తులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. శ్రీనివాస వసతి సముదాయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో క్యాలెండర్లు అందుబాటు లేకపోవడంతో భక్తులు నిరాశకు గురవుతున్నారు. కేవలం రూ.10 శ్రీవారి, పద్మావతి అమ్మవారి క్యాలెండర్లు తప్ప ఇంకేమీ లేవని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. విష్ణునివాసం, గోవిందరాజస్వామి టెంపుల్ సమీపంలోని టీటీడీ పుస్తక ప్రదర్శన కౌంటర్‌లోనూ గత రెండు రోజులుగా ఇదేతంతు కొనసాగుతోంది. కేవలం టీటీడీ ఏడీ బిల్డింగ్ ఎదుటగల కౌంటర్లో మాత్రమే కొన్ని రకాల క్యాలెండర్లు అందుబాటులో ఉండడంతో స్థానికులు క్యాలెండర్ల కోసం ఎగబడుతున్నారు. గురువారం ఉదయం నుంచి పెద్దసంఖ్యలో స్థానికులు బారులు తీరడంతో ట్రాఫిక్‌కు కాస్త అంతరాయం ఏర్పడింది. టీటీడీ ఏడీ బిల్డింగ్ వద్ద మాత్రమే కొన్నిరకాల క్యాలెండర్లు మాత్రమే అందుబాటులో ఉండడంతో భారీ ఎత్తున స్థానికులు బారులు తీరారు. క్యూలైన్ల వద్ద వృద్ధులు, మహిళలు పెద్దసంఖ్యలో బారులు తీరగా, కనీసం నీటివసతి, పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనబడింది.

తపాలా బీమా..

జీవితానికి ధీమా



తపాలా బీమా పాలసీపై అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారులు



- తక్కువ ప్రీమియం.. ఎక్కువ బోనస్
- పాలసీల ద్వారా కుటుంబాలకు వెలుగు
- ప్రజల్లో అవగాహన అంతంతే..

నారాయణవనం : భారత ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన తపాలా జీవిత బీమా పథకం ప్రజల జీవితాలకు ఆర్థిక భరోసా ఇచ్చేలా దోహద పడుతోంది. అన్ని బీమా కంపెనీల కంటే తక్కువ ప్రీమియాన్ని వసూలు చేస్తూ అధిక బోనస్‌తో ఎక్కువ మొత్తాలను అందుకోవచ్చు.1884 ఫిబ్రవరి 1న కేవలం తపాలా శాఖలో ఉద్యోగం చేసే వారి కోసం ప్రారంభమైన పీఎల్‌ఐ కాలగమనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, బ్యాంక్, కార్పొరేషన్ ఉద్యోగులు, ఇంజినీరింగ్ కళాశాలల ఉద్యోగులు, బీటెక్, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంసీఏ, విద్యనభ్యసించి ప్రైవేటు ఉద్యోగులు, న్యాయవాదులు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, ఇలా అందరికీ బీమా పాలసీలను తపాలాశాఖ అందిస్తోంది.

తపాలా బీమా పాలసీలను 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు గల వారు తీసుకోవచ్చు. రూ.20 వేల నుంచి దాదాపు రూ.50 లక్షల వరకు తీసుకునే సౌకర్యం ఉంది. పాలసీలు 3 నెలలు, 6 నెలలు, సంవత్సరానికి ఒకసారి చెల్లించే సౌలభ్యం కల్పించింది. పీఎల్‌ఐలో ప్రధానంగా 6 రకాల పాలసీలు అమలవుతున్నాయి. వాటిలో సంతోష్, సువిధ, సుమంగళి, యుగళ్ సురక్ష, సురక్ష, బాలజీవన్ బీమా పాలసీలున్నాయి. వీటిపై ప్రజల్లో చాలా మందికి అవగాహన లేదు. దీనిపై పోస్టల్ శాఖ అధికారులు సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

సద్వినియోగం చేసుకోండి



“ తపాలా శాఖ ద్వారా అందే బీమా పాలసీలతో మంచి రాబడి అందుతుంది. మిగతా అన్ని బీమా సంస్థల నుంచి వచ్చే రాబడి కంటే మెరుగైన ఆదాయం వస్తుంది. అన్నిరకాల ఉద్యోగులు పీఎల్‌ఐ పాలసీలను అన్ని తపాలా కార్యాలయాల్లో పొందవచ్చు. అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఈ పాలసీలను సద్వినియోగం చేసుకుంటే కుటుంబానికి భరోసా ఉంటుంది.

– సతీష్, ఐపీఓ, పుత్తూరు

పాలసీల వివరాలు ఇలా..

- **సంతోష్** : తపాలా శాఖ ద్వారా తీసుకున్న పాలసీలలో అధిక శాతం (80 శాతం) మంది మొగ్గు చూపుతున్న ఎండోమెంట్ పాలసీ ఇది. క్రమంగా ప్రీమియం చెల్లించిన 3 సంవత్సరాల తర్వాత రుణం తీసుకునే సదుపాయం ఉంది. ప్రీమియం మొత్తం ట్యాక్స్ సేవింగ్ బెనిఫిట్‌ను పొందవచ్చు. పాలసీ ఆమోదించిన నాటి నుంచి పూర్తి జీవిత రక్షణ ఉంటుంది.
- **సువిధ** : హోల్ లైఫ్ పాలసీదారులు 5 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత సంతోష్ పాలసీలోకి మారే వెసులుబాటు కల్పించారు. తక్కువ డబ్బులు చెల్లించే వీలుతో పాటు రుణం తీసుకునే సౌకర్యం కలదు.
- **సుమంగళి** : మనీ బ్యాక్ పాలసీగా తపాలాశాఖ అందిస్తోంది. 15, 20 సంవత్సరాల వ్యవధిలో పాలసీని పొందవచ్చు. 15 సంవత్సరాల పాలసీలో వరుసగా 6 సంవత్సరాలు పూర్తి కాగానే కట్టిన మొత్తం నుంచి 20 శాతం , 9 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, 12 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, చివరగా 15 సంవత్సరాల తర్వాత 40 శాతం నగదుతో పాటు అదనపు బోనస్‌ను పొందవచ్చు. దీంతో పాటు 20 సంవత్సరాల పాలసీలు 8, 12, 16, 20 సంవత్సరాలలో బోనస్‌తో లభిస్తుంది. ప్రధానంగా మధ్య తరగతి ఉద్యోగులకు ఎంతో ప్రయోజనకరం.
- **యుగళ్ సురక్ష** : ఇది జాయింట్ (భార్యాభర్తలకు) పాలసీ. ఇందులో ఒకరు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. రిస్క్ కవరేజ్ మాత్రం దంపతుల ఇద్దరికీ వర్తిస్తుంది. ఈ పాలసీకి సంతోష్ పాలసీ నిబంధనలు వర్తిస్తాయి. కాగా ఈ పాలసీ కింద నాన్ మెడికల్ పాలసీగా గరిష్ఠంగా రూ.5 లక్షలకు మాత్రమే తీసుకోవచ్చు.
- **సురక్ష** : ఇది హోల్ లైఫ్ పాలసీ. 19 నుంచి 58 సంవత్సరాల గల వారు పాలసీకి అర్హులు. రూ.20 వేల నుంచి రూ.50 లక్షల వరకు పాలసీని తీసుకోవచ్చు. 4 సంవత్సరాలు చెల్లించిన తరువాత రుణం తీసుకునే సౌలభ్యం ఉంది. మెచ్యూరిటీ మొత్తాన్ని 80 సంవత్సరాల తర్వాత పాలసీదారుడికి గాని, వారి నామినీకి గాని చెల్లిస్తారు. ప్రతి లక్ష రూపాయలకు రూ.7,600 బోనస్‌గా ఏడాదికి అందుకోవచ్చు.
- **చిల్డ్రన్స్ పాలసీ** : 5 నుంచి 20 సంవత్సరాల లోపు బాల, బాలికలకు ఈ పాలసీని తపాలాశాఖ అందిస్తోంది. ప్రధానంగా పీఎల్‌ఐ పాలసీలో పిల్లల తల్లిదండ్రులు నమోదై ఉంటేనే.. చిల్డ్రన్స్ పాలసీ వర్తిస్తుంది. ఇందులో రూ.20 వేల నుంచి రూ.30 లక్షల వరకూ పాలసీ తీసుకునే సౌకర్యం కలదు.

ఇసుక డంపు సీజ్



అనుమతి లేకుండా సుబ్బనాయుడు కండ్రిగలో నిల్వ చేసిన ఇసుక డంపు

నాగలాపురం : ఉచిత ఇసుక పేరుతో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి సుబ్బనాయుడు కండ్రిగ ఇసుక రీచ్ నుంచి అధికారుల కళ్లుగప్పి ట్రాక్టర్లలో ఇసుకను తరలించి మరో ప్రదేశంలో నిల్వ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు స్థానిక ట్రాక్టర్ యజమానులు ఇక్కడ ఇసుక తీయడానికి తహసీల్దారు అనుమతి పొందామని దర్జాగా తరలించుకుపోతున్నారు. ఈ మేరకు గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీనిపై రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన 15 లోడ్ల ఇసుకను సీజ్ చేసి తహశీల్దార్ వచ్చే వరకు మహిళా సంరక్షణ కార్యదర్శి పర్యవేక్షణలో ఇసుక డంపింగ్ వద్ద నిఘా పెట్టినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా సుధాకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఎస్వీ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా సుధాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనకు కళాశాల సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి, పుత్తూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి, చంద్రగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కందాటి విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగలాపురంలో పోరుబాట

- ఏడీఈ కార్యాలయం వద్ద నిరసన
- పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి రావాలని పిలుపు



నూకతోటి రాజేష్, సత్యవేడు సమన్వయకర్త

వరదయ్యపాళెం : ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం శుక్రవారం సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు పార్టీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. ఆ మేరకు విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ కూటమి సర్కారుపై ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న పోరుబాట కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి నాగలాపురంలోని టీఆర్‌ఆర్ కల్యాణ మండపం నుంచి ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం ఏడీఈకి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపడుతున్న పోరుబాట కార్యక్రమానికి పెద్ద ఎత్తున 7 మండలాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తరలి వచ్చి ప్రజల పక్షాన చేపడుతున్న కార్యక్రమానికి మద్దతు పలకాలని కోరారు.

భూసేకరణపై రైతులతో

కలెక్టర్ ముఖాముఖి



కలెక్టరేట్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

సత్యవేడు : మండలంలోని శ్రీసిటీలో పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయని ఏపీఐఐసీ కోసం సత్యవేడు మండల రైతులతో భూసేకరణపై కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ముఖాముఖి చర్చించి రైతుల అభిప్రాయాలు తెలుసుకొన్నారు. గురువారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో సత్యవేడు మండలం కొల్లడం, పెద్ద ఈటిపాకం, ఇరుగుళం, చిన్న ఈటిపాకం గ్రామాల రైతులతో కలెక్టర్ , జేసి శుభం బన్సల్, ఆర్డీఓ సూళ్లూరుపేట కిరణ్మయితో కలసి చర్చించారు. మండలంలోని సదరు గ్రామంలోని సుమారు 55.66 ఎకరాల భూసేకరణ ఏపీఐఐసీ కోసం డిసెంబరు 15న భూసేకరణ ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, అందులో సుమారు 40 ఎకరాలు పట్టా భూమి ఉందని ఆ మేరకు రైతులతో ఎకరాకు చెల్లించాల్సిన నష్ట పరిహారంపై కలెక్టర్, జేసీ చర్చించి వారి అభిప్రాయాలు తెలుకొని వివరించారు.

మరొకసారి సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సత్యవేడు మండల తహసీల్దారు సుబ్రమణ్యం , రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇరుకు వీధుల్లో లారీల రాకపోకలు



ఇరుకు వీధిలో వెళుతున్న భారీ వాహనం

– ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట పట్టణంలోని ఇరుకు వీధుల్లో పగటిపూట భారీ వాహనాలు వస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ఇరుకు వీధుల్లోకి పగటి పూట భారీ వాహనాలు రాకుండా పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసిన లెక్క చేయకుండా గురువారం సాయంత్రం లారీని ఇరుకు వీధిలోకి తీసుకురావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో ఆ వీధిలోని పాఠశాలను వదలడంతో విద్యార్థులను తీసుకొని వెళ్లేందుకు తల్లిదండ్రులు అవస్థలు పడ్డారు. పదే పదే భారీ వాహనాలు చిన్న వీధుల్లోకి రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు కఠిన చర్యలు తీసుకొని భారీ వాహనాలను పగటి పూట ఇరుకు వీధుల్లోకి రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యతగా రోడ్డు నిర్మాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈ శంకరయ్య

సత్యవేడు : పల్లె పండుగ కింద చేపట్టే సీసీ రోడ్లు నాణ్యతగా చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ డీఈ శంకరయ్య కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సత్యవేడు, బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం మండలాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సిమెంట్ రోడ్ల నాణ్యతా నిర్మాణాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మంజూరైన పనులు డిసెంబరులోపు ప్రారంభించి ఉండాలన్నారు. పనులు ప్రారంభించే సమయానికి ఇసుక, సిమెంట్ సమకూర్చుకోవాలన్నారు. పనులు నాణ్యత పరిశీలన తప్పనిసరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ వెంకటరమణ, క్వాలిటీ కంట్రోల్ ఏఈ మోహన్, మండల ఏఈ ఇబ్రహీం ఖాన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 12 అర్జీలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయతీలోని అడుసుపాలెం, తాతయ్య కాలవ గ్రామాల్లో గురువారం డిప్యూటీ తహసీల్దార్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెండు గ్రామాలకు సంబంధించి 12 సమస్యలపై స్థానికులు అర్జీలు ఇచ్చారని డీటీ శ్యాంప్రసాద్ తెలిపారు. సదస్సులో సుబ్రమ్మణ్యం రెడ్డి, వీఆర్వో రమేష్ , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీతోనే నైపుణ్యం మెరుగు



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు : పాఠశాలలో నిర్వహించే పోటీల్లో విద్యార్థులు పాల్గొనడంతో వారి నైపుణ్యాలు మెరుగు పడుతాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మదనంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా కళావేదిక నిర్వాహకులు అరవ జయపాల్ ఆధ్వర్యంలో సాహిత్యంపై అభిలాష పెంపొందించేందుకు చలం గారి సాహిత్యంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి రూ.516 లక్ష్మి (10వ తరగతి), ద్వితీయ బహుమతి రూ.316 విష్ణు (9వ తరగతి), తృతీయ బహుమతి రూ.216 బి.సుజన (10వ తరగతి) అందుకొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చినబాబు, సర్పంచ్ శివరంజని, స్కూల్ కమిటీ చైర్మన్ ఎం. మునస్వామి, వీకేఎస్ బాషా, వెంకటేశులు, మురళి, భాస్కరన్, నాగరాజు, గోపి, అమర్‌నాద్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

స్విమ్స్ హెచ్ఓడీ పేరు మార్చరా..?

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో న్యూరాలజీ విభాగాధిపతిగా, స్విమ్స్ డైరెక్టర్‌గా డాక్టర్ వెంగమ్మ పదవీ విరమణ చెంది ఏడాది అవుతోంది. అయితే స్విమ్స్ ఆస్పత్రి న్యూరాలజీ విభాగాధిపతిగా ఇప్పటికీ ఆమె పేరే ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవ్వాల్సిన ఆస్పత్రిలో ఏడాది అవుతున్నా ఇప్పటికీ నేమ్ బోర్డ్ మార్చకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మడుగు.. నిర్లక్ష్యాన్ని కడుగు !



మండలంలోని నెల్లటూరు వీధులు అధ్వానంగా మారాయి. వీధుల్లో అడుగు తీసి అడుగు వేయాలంటే నరకం కనిపిస్తోందంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వీధులు పూర్తిగా చెరువులను తలపించే విధంగా వర్షపు నీటి నిల్వలతో గుంతలమయంగా మారాయి. దీంతో అటు వాహనదారులు, ఇటు పాదచారులు రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను ఆలకించి సిమెంటు రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

-వరదయ్యపాళెం

రోడ్డు భద్రతపై అవగాహన



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి తదితరులు

శ్రీకాళహస్తి : రోడ్డు భద్రతపై పోలీసులు, ప్రజాప్రతినిధులు గురువారం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్కూల్ ఆవరణం నుంచి వీఎంసీ సర్కిల్, జయరామరావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూరోడ్డు, సినిమా వీధి, ఆర్టీసీ బస్టాండు వరకు ఈ ర్యాలీ జరిగింది. పలు పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు.అదే విధంగా కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సుబ్రహ్మణంరెడ్డి, గరికపాటి రమేష్, పాఠశాలల నిర్వాహకులు, సీఐలు, ఆర్టీవో అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ అణగారిన వర్గాల ఆశాజ్యోతి



ఆవిర్భావ వేడుకల్లో నేతల సంబరాలు

శ్రీకాళహస్తి : భారత కమ్యూనిస్టు పార్టీ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని సీపీఐ నేతలు అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో సీపీఐ శత ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పేదలకు సాగు భూములు, ఇళ్ల స్థలాలు పంపిణీ ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, శివకుమార్, శ్రీనివాసులు, కార్తీక, మల్లికారుజన్, మునిచందు, చారులత, తులసి, అయ్యప్ప, రాజయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం కూడలిలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కార్తిక్ ఆధ్వర్యంలో ఉత్సవాలను జరుపుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు మురళి, శివ, ఏఐటీయూసీ నాయకులు సుబ్బరాజు, చంద్రకళ, హరి పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : బుచ్చినాయుడు కండ్రిగలో గురువారం సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలను మండల సీపీఐ కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు చంద్రమ్మ, ఫీటర్, మారయ్య, భాస్కర్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

వరదయ్యపాళెం : పేద ప్రజలకు సీపీఐ అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ తెలిపారు. సీపీఐ ఆవిర్భావం సందర్భంగా గురువారం వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో పార్టీ నేతలతో కలసి జెండా ఆవిష్కరించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీసి ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధమని చిన్నిరాజ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సభ్యులు బుర్రా చంద్రశేఖర్, నాయకులు బాలగురునాథం, ఏఐటీయూసీ నేతలు చంద్ర, మురళి, నాగార్జున, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పోలయ్య, కృష్ణమూర్తి, దొరస్వామి పాల్గొన్నారు.